జిందగీ
చైతన్య
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 8 జూలై 2024
www.ntnews.com
13

నలుదిశల శక్తి కేంద్రాలు

చెట్టు.. అమ్మ. పుట్ట.. అమ్మ. ప్రకృతిలో ఉన్న శక్తి.. అమ్మ. ఆ శక్తి విభిన్న కళలే.. గ్రామదేవతలుగా కొలువుదీరిన మూలపుటమ్మలు. ఆ చల్లని తల్లుల వేడుకకు వేళైంది. ఆషాఢం వచ్చింది.. భాగ్యనగరి బోనం ఎత్తుతున్నది. అమ్మవార్ల జాతరకు నగరం సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో భాగ్యనగరంలో శక్తి కేంద్రాలుగా విలసిల్లుతున్న అమ్మవార్ల చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం తెలుసుకుందాం.

తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, ఇక్కడి ప్రజల ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటి చెప్పే పండుగల్లో బోనాలు ఒకటి. ప్రకృతిని శక్తిస్వరూపిణిగా, జగన్మాతగా కొలవడం భారతీయ సంప్రదాయం. ప్రకృతి శక్తుల విభిన్న కళలే గ్రామదేవతలని దేవీ భాగవతంలో ఉంది. ప్రకృతి తల్లిలాంటిది. ఆ తల్లి ఒడిలో సేదతీరాలంటే ఆమెను పూజించాలి. అంటే ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలి. మానవ మనుగడకు అదే శ్రీరామరక్ష. అందుకు భిన్నంగా వ్యవహరించినప్పుడు, ప్రకృతి ప్రకోపిస్తే విపత్కర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. వాటిని అధిగమించేందుకు, మారుతున్న రుతువులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వివిధ రూపాలు, పేర్లతో కొలువైన గ్రామదేవతలను వేడుకుంటూ జరుపుకొనే పండుగే బోనాలు. ఏటా ఆషాఢ మాసం తొలి ఆదివారం మొదలయ్యే బోనాల జాతర ఒక్కో ఆదివారం ఒక్కో ప్రాంతంలో జరుగుతుంది. ఈ సంప్రదాయం గోల్కొండ జగదంబ ఆలయం బోనాలతో ప్రారంభమవుతుంది. 'లష్కర్ బోనాలు'గా పిలిచే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాల మీదుగా పాతబస్తీ లాల్ దర్వాజ బోనాలతో ముగుస్తుంది.

గోల్కొండ జగదంబ మహాకాళి

ఈ ఆలయం 900 సంవత్సరాల క్రితం నుంచీ ఉంది. అంటే గోల్కొండ కోట కట్టడానికన్నా ముందే ఈ ఆలయం ఉండేదన్నమాట. పూర్వం ఈ కొండపై గొల్లలు పశువులను మేపుకోవటానికి వచ్చేవారు. అమ్మవారిని వాళ్లే కనుగొన్నారని చెబుతారు. మరో కథనం ప్రకారం కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు ఈ కొండపై మట్టికోట కట్టించేటప్పుడు అక్కడే ఉన్న జగదంబ అమ్మవారిని పూజించి బోనాల పండుగ చేశాడట. ఇక ఈ ప్రాంతంలో ఎక్కువగా గొల్లవాళ్లు ఉండటం వల్ల దీనిని గొల్లకొండ అనేవారనీ, అదే క్రమంగా గోల్కొండ అయిందని చెబుతారు. అప్పటినుంచీ ఇక్కడ బోనాల ఉత్సవం నిర్వహిస్తూ ఉన్నారు. అతి పురాతనమైన ఈ ఆలయం నుంచి హైదరాబాద్ బోనాల ఉత్సవం ప్రారంభమవుతుంది. గోల్కొండ రాజుల కాలంలో అక్కన్న, మాదన్నలు కూడా ఈ ఉత్సవం జరిపినట్లు తెలుస్తున్నది.

ఉజ్జయిని మహంకాళి

ఈ ఆలయం నిర్మాణం వెనుక ఒక చిన్న కథ ఉంది. క్రీ.శ.1813 ప్రాంతంలో సైన్యంలో పని చేసే సురిటి అప్పయ్య సికింద్రాబాద్‌లో ఉండేవాడు. ఆయన బదిలీపై మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతానికి వెళ్లాడు. ఒకసారి అక్కడ కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలి, చాలామంది చనిపోసాగారు. అప్పుడు అప్పయ్య మహంకాళి ఆలయానికి వెళ్లి ఆ తల్లితో 'కలరా తగ్గిస్తే తన సొంత ఊరిలో అమ్మవారికి ఆలయం నిర్మిస్తానని' మొక్కుకున్నారట. కొన్నాళ్లకు కలరా తగ్గింది. రెండు సంవత్సరాల తరువాత స్వస్థలానికి వచ్చిన అప్పయ్య దారుతో అమ్మవారి విగ్రహాన్ని చేయించి ఒక వేపచెట్టు కింద ఉంచి పూజించసాగారు. తర్వాత చిన్న ఆలయం కట్టించారు. తర్వాతి కాలంలో ఆలయం విస్తీర్ణం చేపట్టగా తూర్పువైపు ఉన్న బావిలో మాణిక్యాంబ విగ్రహం దొరికిందట. ఆ విగ్రహాన్ని అమ్మవారి విగ్రహం పక్కనే ప్రతిష్ఠించాడు అప్పయ్య. 1864లో అప్పయ్య సారథ్యంలో అప్పటివరకు ఉన్న విగ్రహాల స్థానంలో ప్రస్తుతం పూజలు అందుకుంటున్న మూర్తులను ప్రతిష్ఠించారు. ఇక్కడ అమ్మవారు ఒక చేతిలో ఖడ్గంతో, మరో చేతిలో భరిణతో దర్శనమిస్తారు.

బల్కంపేట ఎల్లమ్మ

బల్కంపేట ఎల్లమ్మ వైభవం 15వ శతాబ్దం నాటి నుంచి ఉందని భక్తుల నమ్మిక. పరశురాముని తల్లి రేణుకాదేవి అవతారమే ఎల్లమ్మ తల్లిగా చెబుతారు. బాలా త్రిపురసుందరిగా కూడా ఎల్లమ్మను భావిస్తారు. మరికొందరు ఎల్లమ్మను

బాలాంబికగా పిలుస్తారు. రాను రాను బాలాంబికగా తల్లికొలువైన ప్రాంతం బల్కమ్మపేటగాను, బల్కంపేటగా మారిందని తెలుస్తున్నది. ఈ ఆలయంలో ఉన్న బావిలోని నీటిని పవిత్ర తీర్థంగా స్వీకరిస్తుంటారు. పూర్వం ఇక్కడ ఒక బావి ఉందనీ, దాని మధ్యలో అమ్మవారు ఉండేవారనీ, బావి పైభాగంలోని మంటపంలో అఖండ జ్యోతి నిత్యం వెలుగుతూనే ఉంటుందనీ స్థల పురాణం. బావి మధ్యలో కొలువై ఉండటంతో గతంలో దూరం నుంచే అమ్మవారిని దర్శించుకునే వారట. అయితే, నిజాం నవాబుల

కాలంలో పనిచేసిన శివరాజ్ బహద్దూర్ చొరవతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు తెలుస్తున్నది.

లాల్‌దర్వాజ సింహవాహిని

భాగ్యనగరిలో ఆధ్యాత్మిక శక్తి కేంద్రం లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయం. 1908లో నగరాన్ని మూసీ నది వరదలతో ముంచెత్తింది. నీళ్లు చార్మినార్ మైసమ్మగుడి వరకు చుట్టుముట్టాయి. నగర ప్రజల జీవనం అతులాకుతలమైంది. అప్పుడు హైదరాబాద్ సంస్థానం ప్రధానమంత్రిగా ఉన్న మహారాజా కిషన్ ప్రసాద్ నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీ ఖాన్ దగ్గరికి వెళ్లి చార్మినార్ సమీపంలోని లాల్‌దర్వాజలో సింహవాహిని మహంకాళి అమ్మవారు ఉందనీ, ఎంతో మహత్తుగల ఆ అమ్మవారికి పూజలు నిర్వహిస్తే మూసీ నది శాంతిస్తుందని సూచించారట. దాంతో నిజాం నవాబు మహంకాళి అమ్మవారికి మేలిమి ముత్యాలను, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి పూజలు నిర్వహించారట. బంగారు చేటలో పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలను మూసీనది ప్రవాహానికి సమర్పించారట. వరద తగ్గుముఖం పట్టడంతో ఆనాటి నుంచి ఏటా లాల్‌దర్వాజ మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించే సంప్రదాయం వచ్చిందని పెద్దలు చెబుతారు.

... ఎస్.ఎన్. ఉమామహేశ్వరి

కాలి బంతి కావొద్దు

కథాసుధ

ఓ గ్రామంలోని రైతు, ప్రతి పౌర్ణిమ రోజు సాయంత్రం రామాలయం వద్ద అన్నదానం చేసేవాడు. చుట్టుపక్కల గ్రామస్తులు కూడా అక్కడికి వచ్చి భోజనం చేసేవారు. ఒక పౌర్ణిమ రోజు సాయంత్రం గ్రామం నుంచి వెళ్తున్న ఓ ప్రవచనకర్తకు అన్నదానం విషయం తెలిసింది. రైతును కలుసుకొని ఆప్యాయంగా పలకరించాడు. 'అన్నదానం అన్ని దానాలకన్నా మిన్న' అని చెబుతూ అలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు రైతును అభినందించాడు. కానీ, రైతు బాధగా ముఖం పెట్టి 'చాలా మంది గ్రామస్తులు నేను చేస్తున్న అన్నదానం గురించి రకరకాలుగా చెప్పుకొంటున్నారు. స్వార్థం, కీర్తి కాంక్షతో నేను ఈ పని చేస్తున్నానని మాట్లాడుతున్నారు. ఎక్కువ పాపాలు చేసి, పాపపరిహారంలో భాగంగా అన్నదానం చేస్తున్నానని మరికొందరు నిందలు వేస్తున్నారు. నిజంగా నాకు ఎలాంటి స్వార్థం లేదు. నా మనసుకు తోచింది కాబట్టి చేస్తున్నాను. మంచికి పోతే ఇలా నిందలు పడాల్సి వస్తున్నది' అని బాధపడ్డాడు. ప్రవచనకర్త స్పందిస్తూ..



పక్కనే ఫుట్‌బాల్ ఆడుతున్న పిల్లలను చూడమని చెప్పాడు. 'వాళ్లు ఏం చేస్తున్నారో తెలుసా?' అని రైతును అడిగారు. 'దొరికినవారు దొరికినట్టు బంతిని తన్నుతున్నారు' అన్నాడు రైతు. 'మనమూ అలాగే ఉండాలి. మనకు మంచి అనిపించింది చేస్తూ పోవాలి. ఎదుటివారి అభిప్రాయాల, ఆలోచనల కాలి బంతి కాకూడదు. ఎందుకంటే ఆ బంతి ఎటు పోతుందో చెప్పలేం. 'పురైకో బుద్ధి, జిహ్వకో రుచి!' అని తెలిసిందే కదా. ఎంత మంచిపని చేసినా రంధ్రాన్వేషణ చేసే వాళ్లు ఉంటారు. వారి ఆలోచనలకు ప్రాధాన్యమిస్తే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోతాయి. ఏ స్వార్థం లేకుండా అన్నదానం చేస్తున్నావు. నీ అంకితభావం చూసి విమర్శకులు కూడా నిందలు వేయడం నిదానంగా మానుకుంటారు. నీ గొప్పదనాన్ని అర్థం చేసుకుంటారు' అన్నాడు. ఆ మాటలకు పొంగిపోయిన రైతు.. అక్కడ అన్నదానానికి వచ్చిన వారికి హుషారుగా భోజనం వడ్డించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

క్షమించేద్దాం!

ఇస్లాం బోధ

ద్వేషాన్ని ప్రేమతో జయించవచ్చు. 'నీకు ఇవ్వని వారికి ఇవ్వు. నీతో సంబంధాలు తెగదెంపులు చేసుకున్నవారిని కలుపుకొనిపో. నీపై దౌర్జన్యం చేసిన వారిని క్షమించి వదిలిపెట్టు. ఇలా చేస్తే మనిషి ఉన్నత వ్యక్తిత్వం కలవాడు అవుతాడు' అంటుంది ఖురాన్. ఒకరోజు ప్రవక్త ప్రయాణంలో ఒక చెట్టుకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను హతమార్చడానికి ఇదే మంచి సమయమని ఓ వ్యక్తి భావించాడు. చేతిలో కత్తితో ఆయన ముందుకు వచ్చి, 'ఇప్పుడు నిన్ను ఎవరు రక్షిస్తారని' కత్తి దూశాడు. అల్లాహ్ కాపాడతాడన్నారు ప్రవక్త. ఇంతలో శత్రువు చేతిలో కత్తి కాస్తా జారిపోయింది. ప్రవక్త ఆ కత్తి తీసుకుని 'ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తార'ని అడిగారు. ఆ వ్యక్తి వణుకుతూ 'ఎవరూ లేరు' అన్నాడు. ప్రవక్త అతనితో 'తప్పు... నిన్ను కూడా అల్లానే రక్షిస్తాడు' అన్నారు. ఆ వ్యక్తిని క్షమించి వదిలేశారు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇంటి నుంచి మసీదుకు వెళ్లే దారిలో ఒక మహిళ నివాసం ఉండేది. ఆమె ఇంటి పైకప్పు నుంచి రోజూ ఆయనపై చెత్త వేసేది. ప్రవక్త మౌనంగా వెళ్లిపోయేవారు. ఒకరోజు ప్రవక్తకు ఆ మహిళ కనిపించలేదు. ఆయన అక్కడ ఆగి చుట్టుపక్కల వారిని ఆమె గురించి వాకబు చేశారు. ఆ మహిళ అనారోగ్యంతో మంచం పట్టిందన్నారు వాళ్లు. ప్రవక్త ముసలమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమెను పరామర్శించారు. ధైర్యం చెప్పారు. ప్రవక్త వైఖరి ఆమెపై ఎంతో ప్రభావం చూపింది. క్షమాగుణం ఎంత గొప్పదో పై రెండు సంఘటనలు చాటి చెబుతున్నాయి. మన్నింపు వైఖరిని అలవర్చుకోవడమే ప్రవక్త (స) పట్ల మన ప్రేమకు నిదర్శనం.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

మర్దనం.. గుణ వర్ధనం

మన పోతన 178 మధురిమ వ భాగం

పోతన దృష్టిలో 'భాగవత పురాణ ఫల రసాస్వాదన' కన్న ఉత్కృష్టమైన పదవి సృష్టిలోనే లేదు. బ్రహ్మలోకాన్ని సైతం తృణీకరించడం– వద్దని వదలడం వైరాగ్యానికి ఆఖరి హద్దు. పరమ భాగవతులు పంచమ పురుషార్థమైన భక్తి లేక కైవల్యపదాన్ని కాక కల్లలైన ఇతర చిల్లర పదవులను ఒల్లరు (ఇష్టపడరు) గాక ఒల్లరని భక్తకవి తల్లజుడు పోతన బల్ల చరచి వెల్లడించాడు.

శుక మహర్షి రాజర్షి పరీక్షిత్తుతో... యోగేశ్వరుడు కృష్ణుడు కాళియుని భోగ తతిని– పడగల సమూహాన్ని అతి దారుణంగా చితకబాదటం భూతి– భాగ్యం ఎలా అవుతుంది? అన్న శంకా నివారణ చేస్తూ పన్నగ సతులు నంద సుతుని రూపాన ఉన్న శ్రీపతిని– కన్నయ్యను ఇంకా ఇలా సన్నుతించారు– అహి(సర్ప) మర్దనా! పూర్వకాలంలో మహిళా రత్నం శ్రీదేవి బహుకాలం తపస్సు చేసి, నేమించి (దీక్షతో) ఎన్నో నోములు నోచి, నిన్నే కామించి సేవించింది. ఆ పూజాఫలంగా అంబుజాసన (లక్ష్మి), దేదీప్యమానంగా వెలుగొందే నీ పాదారవిందాల పరాగ (ధూళి) కణాలను పొందే, కాదు కాదు, తాకే అర్హతను ఓ బర్హావతంసా!– (సిగలో నెమలిపింఛం నగగా గల ఓ పన్నగశయనా!) సంపాదించుకోగలిగింది. అలాంటిది ఏ విధమైన యోగ్యతా లేకనే ఈ కాళియుడు తావక– నీ పవిత్ర పాదస్పర్శకు నోచుకున్నాడే! ఇది ఎంత అద్భుతం స్వామీ!

ఉ॥'ఒల్లరు నిర్జరేంద్ర పద మొల్లరు బ్రహ్మపదంబు నొందగా
నొల్లరు చక్రవర్తి పద మొల్లరు సర్వరసాధిపత్యము
న్నొల్లరు యోగసిద్ధి మరి యొండు భవంబుల నొందనీని నీ
సల్లలితాంఘ్రిరేణువుల సంగతి నొందిన ధన్యులెప్పుడున్'

'ఓ నిర్వాణ (ముక్తి) పతీ! జన్మ రాహిత్యాన్ని కలిగించే అతి లలితమైన నీ పాద రేణువుల సంగతి (స్పర్శ) పొందిన ధన్యులు– అనన్య భక్తి సంపన్నులు, సార్వభౌమ– చక్రవర్తి పదవిని గాని, వరుణ లోకాధిపత్యంగాని, అణిమా గరిమాది యోగసిద్ధిని గాని, శక్ర– దేవేంద్ర పదవి గాని, కడకు పరమేష్ఠి– బ్రహ్మపదాన్ని కూడా సదా ఇష్టపడరు కదా!'

మూలంలోని 'యత్పాద రజః ప్రపన్నాః' అన్నదానికి పెంపుదల పై పద్యంలోని నాల్గవ పాదం. ఆరంభం (పీఠిక)లోనే అమాత్యుడు 'శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్' అనీ, 'నే పలికిన భవహర మగునట' అనీ, 'నా జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్' అనీ ఘంటాపథంగా పలికాడు గదా! కాళియ కాంతలు బాలకృష్ణునితో... 'నేరము గల్గు మద్విభుని నేడిట గావగదే కృపానిధీ'– ఓ కరుణానిధీ! నీ సన్నిధిలో నేరాలు ఉంటాయా? తనయుల నేరాలను తండ్రులు పట్టించుకోరుగా! ఓ నందపట్టీ! నీవు జగత్తుకే తండ్రివి గదా! మా భర్త అపరాధాన్ని మన్నించు. మాధవా! మేము మాంగళ్యాన్ని కోల్పోయి వైధవ్యాన్ని భరించలేము.. 'అనాథాలాప మాలింపవే, చాలున్నీ పద తాడనంబు పతి భిక్షంబెట్టి రక్షింపవే'– లక్ష్మీనాథా ఈ అనాథల దీనాలాపాలు ఆలించు. నీ పాద తాడనం చాలించు. ఓ పక్షివాహనా! మాకు పతి భిక్ష ప్రసాదించు. మా సౌభాగ్యాన్ని రక్షించు.

ఆ॥'మమ్ము బెండ్లిసేయు మా ప్రాణవల్లభు
ప్రాణమిచ్చి కావు భక్తవరద!
నీవు సేయు పెండ్లి నిత్యంబు, భద్రంబు
చిన్ననాటి పెండ్లి పెండ్లి కాదు'

చక్రపాణీ! మా ప్రాణపతి ఈ కాళియుని ప్రాణాలు కాపాడి, ఇతనితో మాకు మరల పాణిగ్రహణం జరిపించు, మాపై శుభాలు కురిపించు. పన్నగశయనా! మా చిన్ననాటి పెళ్లి పెళ్లే కాదు. బమ్మ తండ్రీ! మా దృష్టిలో అది బొమ్మల పెళ్లి మాత్రమే! నీ చేతుల మీదుగా జరిగే ఈ ముద్దుగుమ్మల కల్యాణం శాశ్వతం, శుభంకరం.

శుకుడు పరీక్షిత్తుతో– రాజా! కాళియుని పెళ్లాలు ఇలా జాలిగా వేడుకొనగా వనమాలి వారి విన్నపం ఆలించి అనుగ్రహించాడు. కాళియుని తలలపై తన కాలి తాపులు ఆపుచేసి పక్కకు తొలగిపోయాడు. విషధారి కాళియుని దారికి తేవడమే దానవారి అభిమతం. వానిని సంహరించడం అసురారి సంకల్పం కాదు. పన్నగరాజు బడలి సన్నగిల్లి (కృశించి)న తన పడగలను సవరించుకొంటూ, కడు ఆయాసపడుచూ, కడలి శయనునికి– ఆపన్న శరణ్యునికి అంజలి ఘటించి తిన్నగా ఇలా విన్నవించాడు– కాలాత్మకా! బాలకృష్ణా! మా వ్యాల– సర్పజాతి నీ లీలా సృష్టిలోనిదేగా! సహజమైన మా స్వభావం ఓ అజా(మాయా) పతీ! నీకు తెలియంది కాదు. అది ఎవరికైనా దుస్త్యజమే– విడువరానిదే! మా వికృత చేష్టలు– వంకర నడకలు, విషపు కోరలు సృష్టికర్తవైన నీకు ఎంతమాత్రం వింతలు కావు. యదురాయా! నీ మాయ దురత్యయ– దాటరానిది. మా తెలివితేటలు దానిముందు నీటిమూటలే! సర్వజ్ఞా! అజ్ఞానివైన నా అవజ్ఞను– ధిక్కారాన్ని సైరించు. సర్వం తెలిసిన నీవు నన్ను రక్షించినా సరే, శిక్షించినా సరే!

క॥'నా పుణ్యమేమి సెప్పుదు?
నీ పాదరజంబు గంటి నే సనకాదుల్
నీ పాదరజము గోరుదు
రే పదమందున్న నైన నిటమేలు హరీ!'

శ్రీహరీ! ధీరులు, ఆశాదూరులు, సదా కుమారులు, నివృత్తి పరాయణులు అయిన సనకాది మహర్షులు కూడా నీ పాదధూళి పొందటానికి పరితపిస్తూ ఉంటారు. దీన శరణ్యా! అట్టి చరణ ధూళి నాకు లభించింది. నా పుణ్యమేమని చెప్పను? నీ కృపకు నోచుకున్న నాకు ఎక్కడున్నా మేలే జరుగుతుంది.' ఇలా విన్నవించుకున్న కాళియుని మాటలు విని సర్వేశ్వరుడు కృష్ణుడు ఇట్లన్నాడు... 'ఓ కాళియా! ఈ మడుగులోని నీటిని ఆవులే కాదు, మానవులూ తాగుతుంటారు. కాన, నీవు ఇకముందు ఈ మడుగులో ఉండవద్దు. భార్యాబిడ్డలతో, బంధువర్గంతో కూడి వడిగా సింధువు– సముద్రంలోని నీ పూర్వనివాస స్థలమైన 'రమణక' ద్వీపానికి వెళ్లిపో. గతంలో అక్కడున్న నీవు గరుత్మంతుని భయంతో ఈ మడుగులో వచ్చి చేరావు. నీ పడగల మీద నా పాదాల గుర్తులు చూసి.. పక్షిరాజు నీకు ఇక ఏమాత్రం ప్రతిపక్షి కాడు. నీవు, నీ కుటుంబం ఇక సురక్షితం. అనంతుని ఆజ్ఞను ఔదల దాల్చి కాళియుడు పరమాత్మకి అనేక అమూల్య ఆభరణాలు కానుకలుగా అర్పించి, పలుమారులు ప్రణమిల్లి, ప్రదక్షిణలు గావించి అనుజ్ఞ గైకొని సపరివారంగా రమణక ద్వీపానికి చేరుకున్నాడు. శుకుడు...

క॥'వారిజ లోచను డెవ్వరు
వారింపగ లేని ఫణి నివాస త్వంబున్
వారించి యమున సుధా
వారిం బొలుపారె నెల్లవారికి బ్రియమై

రాజా! వారిజాక్షుడు హరి ఎవ్వారికి వారింప (తొలగింప) వీలుకాని యమునా వారి (జలం)లోని విషధారి కాళియుని నివాసాన్ని తొలగించగానే కాళిందీ నది అమృతం లాంటి జలంతో నిండి కళకళలాడుతూ అందరికీ ఆనందదాయకమయింది.

శుకుడు పరీక్షిత్తుతో... 'రాజా! సౌభరి మహర్షి శాపం వలన పాప (సర్ప) జాతికి శత్రువైన సుపర్ణుడు– గరుడుడు చావు– చచ్చే భయంతో యమున మడుగు జోలికి వచ్చేవాడు కాదు. ఒకనాడు పక్కిరాయడు– పక్షిరాజు ఆ మడుగులోని మత్స్యరాజును ముక్కుతో పొడిచి చంపి మక్కువతో చక్కగా మెక్కివేశాడు. మిగిలిన బడుగు మీనములన్నీ కలవరపడుతూ కడు దీనంగా ఏడుస్తూంటే వాటి గోడు చూడలేక దయాశీలి సౌభరి జాలిపడి, కోపించి 'ఈనాటి నుండి చిలువల తిండి– గరుడుడు వచ్చి చేపలను చంపి తింటే వెంటనే చచ్చిపోవుగాక' అని శకునీశ్వరుని– ఖగనాథుని ముని శపించాడు. ఇలా శాపమని కాళియుని కొక్కనికే తెలుసు'– ఇలాగని శుకముని అవనీపతి పరీక్షిత్తుకు వివరించాడు.

లీలా పరమార్థం: 'కాళియః ఇంద్రియాణ్యాహుః విషయా స్తద్విషం స్మృతమ్'. ఇంద్రియా ధ్యాసయే కాళియ నాగు. వాడు యమునలో పాగావేసి హాయిగా ఉంటున్నాడు. యమున, యమళార్జున భంజను (కృష్ణు)ల సంబంధం అవినాభావం. కాళింది– యమున కృష్ణభక్తికి ప్రతీక. ఇంద్రియాలే కాళియుని పడగలు. ధర్మ విరుద్ధమైన విషయ భోగాల యందలి మితిలేని ఆసక్తియే పడగలలోని విషం. విషం తిన్న వాణ్ని చంపుతుంది. విషయాలు (శబ్ద స్పర్శ రూప రస గంధాలు) కన్నవాణ్ని కాక, మనసులో అనుకొన్న (స్మరించిన) వాణ్ని కూడా చంపుతాయి. భక్తి– భోగాలు పరస్పర విరుద్ధాలు. భక్తి మిష(నెపం)తో చాటు, మాటుగా ఇంద్రియాలతో ధర్మ వ్యతిరేకంగా విషయాలు అనుభవించు వాడే గాటైన కాటువేసే కాళియుడు. భక్తిలో భోగలాలసత అనే భోగి– సర్పం చొరబడితే భక్తికి అది చెఱ– నిర్బంధం. భక్తి మార్గానికి ప్రముఖ ఆచార్యులు– శంకర, రామానుజ, వల్లభ, రామానంద, చైతన్య, తులసి మొదలగు వారంతా పరిపూర్ణ వైరాగ్య సంపన్నులు. పూర్ణ వైరాగ్యం లేనిదే పరా (శుద్ధ) భక్తి కలుగదు. భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు జనని. కాళియుని వంటి భోగ పురుషులు ప్రవేశించగా భక్తి యమున నేడు విషపూరితమవుతోంది. 'భోగే రోగ భయం' అని నీతిశాస్త్ర హెచ్చరిక! భోగాలు పెచ్చరిల్లితే ఇంద్రియాలు చచ్చుబడిపోతాయి. పవిత్రమైన భక్తి వలన వాటికి శక్తి– పుష్టి చేకూరుతుంది. భోగ శబ్దానికి పడగ అని కూడా అర్థం కదా. భోగం కలది భోగి– సర్పం. లోకంలో భోగ పురుషులు– విషయ లంపటులందరూ భోగులే– సర్ప సమానులే! ఎందుకని? 'నానుపహత్య భూతాని భోగః సంభవతి'– (జీవహింస చేయనిదే సాధారణంగా అమితమైన భోగానుభవం సంభవం కాదు) అని వ్యాస పాతంజలి భాష్యం. భగవానుడు అసురులను సంహరించాడు. కాని, కాళియుని కడతేర్చక నిలుకడగా విషం కక్కించాడు. కాన, సాధనలో అదే ఆదర్శం. ఇంద్రియాలను వివేక వైరాగ్యాలతో స్వాధీనపరచుకోవాలి. వాటిని 'రమణక' ద్వీపానికి పంపాలి. అనగా ప్రయత్నపూర్వకంగా పరమాత్మ యందు, సత్సంగమునందు 'రమింప' జెయ్యాలి. అఖండానంద స్వామి, డోంగ్రేజీ వంటి ప్రవక్తలు ఈ లీలా పరమార్థాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

(సశేషం)

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

ధర్మ సందేహం

ధ్వజస్తంభం ఎందుకు?

ఆలయాల్లో ధ్వజ స్తంభం ఎందుకు ఏర్పాటు చేశారు..?

• **కరుణాకర్,** హైదరాబాద్

ఆలయ నిర్మాణంలో ధ్వజస్తంభం అనివార్యమైన ఒక భాగం. ఆలయం సాధకుని దివ్య దేహానికి ప్రతీక. దేహమే దేవాలయమని పెద్దలు చెప్పారు. దేహానికి వెన్నెముక లాంటిదే ఆలయానికి ధ్వజస్తంభం. ఆగమ సంప్రదాయం ప్రకారం దైవ శక్తి ఐదు రూపాలలో ఐదు చోట్ల ఉంటుంది. మూలవిరాట్టులో, ఉత్సవమూర్తిలో, పాదుకలలో, అర్చకునిలో, ధ్వజస్తంభంలో ఉంటుందని ఆగమ శాస్త్రం చెబుతున్నది. కాబట్టి ఆలయానికి ధ్వజ స్తంభం ఉండి తీరాలి. దూరం నుంచి వచ్చే భక్తులకు ఆలయం ఎక్కడ ఉన్నదో సూచిస్తుంది ధ్వజ స్తంభం. అంతేకాదు. భక్తులు గుడికి చేరేసరికి.. వేళదాటి ఆలయ ద్వారం మూతపడితే.. దిగులుపడే అవసరం లేకుండా ధ్వజస్తంభ దర్శనంతో దైవదర్శనం పొందినట్లే. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకొని మన పెద్దలు ఆలయాలలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు.

... శ్రీ